కష్టపడ్డారు.. సాధించారు..

- పోలీస్ కొలువులో మెరిసిన పేదింటి బిడ్డలు

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 8 :
పేద కుటుంబాల్లో కొలువుల పంట పండింది. తల్లిదండ్రుల కష్టం చూసి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని కష్టపడ్డారు. కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి స్ఫూర్తినింపారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి 340 మంది అభ్యర్థులు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. వీరిలో సివిల్ కానిస్టేబుళ్లుగా 149, టీఎస్ఎస్పీ కానిస్టేబుళ్లుగా 97 మంది, ఏఆర్ విభాగానికి 84 మంది,ఎక్సైజ్‌లో ఏడుగురు, జైళ్ల శాఖకు ముగ్గురు ఎంపికయ్యారు. పోలీస్ కొలువులు సాధించిన వారి అభిప్రాయాలు వారి మాటల్లోనే..

భర్త ప్రోత్సాహంతో..

భీంపూర్ మండలం వడూర్ గ్రామానికి చెందిన మంగదుడ్ల ప్రియాంకది వ్యవసాయ కుటుంబం. డిగ్రీ, బీఎడ్ పూర్తి చేసింది. భర్త, కుటుంబ ప్రోత్సాహంతోనే పట్టుదలతో చదివి పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను. నాలుగేళ్ల కూతురు ఉంది. గతంలో ఒక మార్కుతో డీఎస్సీలో టీచర్ ఉద్యోగం పొందలేకపోయాను. అయినా సరే నిరుత్సాహపడకుండా కష్టపడి చదివి ఈవెంట్ ప్రాక్టీసు చేసి కొలువు సాధించాను. మహిళలకు భర్త, కుటుంబీకులు ప్రోత్సాహమిస్తే ఇలాంటి విజయాలు సాధించవచ్చు.

- మంగదుడ్ల ప్రియాంక యాదవ్, వడూర్ గ్రామం, భీంపూర్ మండలం

రెండో ప్రయత్నంలో కొలువు..

తలమడుగు మండలం కజ్జర్ల గ్రామానికి చెందిన అగ్గిమల్ల వెంకట్-రాధ దంపతుల కూతురు రుచిత ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించింది. అమ్మానాన్న వ్యవసాయం చేస్తుంటారు. నేను డిగ్రీ, బీఎడ్ వరకు చదివాను. రెండో ప్రయత్నంలో పోలీస్ కొలువు సాధించాను. రైతు బిడ్డగా గర్వపడుతున్నాను. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

- అగ్గిమల్ల రుచిత, కజ్జర్ల, తలమడుగు

నాన్న ట్రాక్టర్ డ్రైవర్, అమ్మ కూలీ..

మా నాన్న ట్రాక్టర్ డ్రైవర్, అమ్మ కూలీ.. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి. అయినా తల్లిదండ్రులు బీటెక్, పీజీ వరకు చదివించారు. నేను ఆదిలాబాద్ ప్రభుత్వ బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ తీసుకున్నాను. కష్టపడి చదివి ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాను. ఇప్పుడు అమ్మానాన్నలను కంటికి రెప్పలా చూసుకుంటాను.

- సిగ్గుల లావణ్య, దస్నాపూర్, ఆదిలాబాద్

అమ్మ సహకారంతో..

మాది పేద కుటుంబం. అమ్మ గంగమ్మ టేలరింగ్ చేస్తూ నన్ను డిగ్రీ వరకు చదివించింది. నేను సొంతంగా ప్రిపేర్ అయ్యాను. 2018లో పోలీస్ ఉద్యోగానికి ప్రయత్నించి రెండు మార్కుల తేడాతో విఫలమయ్యాను. అయినా కూడా నిరుత్సాహపడకుండా మళ్లీ ప్రయత్నించి సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాను. యువత నిరుత్సాహ పడకుండా ప్రయత్నిస్తే ఏదైనా సాధించవచ్చు.

- ముద్దుల సంజయ్‌కుమార్, ఆదిలాబాద్

భార్య ప్రోత్సాహంతోనే..

నేను డిగ్రీ చేసి ఓ ప్రైవేట్ ఉద్యోగం చేసే వాడిని. తల్లిదండ్రులు పద్మ- మల్లేశ్ రజక వృత్తి చేస్తుంటారు. పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత నా భార్య ప్రోత్సాహించింది. ప్రైవేట్ ఉద్యోగం మాన్పించి ఆమె ఇద్దరు పిల్లలను చూసుకుంటూ నా ప్రిపరేషన్‌కు సహకరించింది. నేను బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ తీసుకున్నా. నమస్తే తెలంగాణ నిపుణ చదవడం ఉపకరించింది. సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

- నడికట్ల సాయికిరణ్, ఆదిలాబాద్

అణగారిన వర్గాల అభివృద్ధే లక్ష్యం

- జైనథ్ ఎంపీపీ గోవర్ధన్
- లబ్ధిదారులకు బీసీ బంధు చెక్కులు పంపిణీ

జైనథ్‌లో బీసీ బంధు చెక్కులు అందజేస్తున్న ఎంపీపీ గోవర్ధన్

జైనథ్, అక్టోబర్ 8 : చేతి వృత్తులను నమ్ముకొని జీవిస్తున్న అణగారిన వర్గాలను అభివృద్ధి చేయడం కోసం సీఎం కేసీఆర్ బీసీ బంధు అమలు చేశారని ఎంపీపీ మార్నెట్టి గోవర్ధన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో లబ్ధిదారులకు బీసీ బంధు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల వృత్తి చేసుకొని జీవిస్తున్న వారు వ్యాపారంలో రాణించేందుకు బీసీబంధు పథకం వచ్చిందన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో ఈ పథకం లేదన్నారు. రాబోయే రోజుల్లో అన్ని కులాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి, రైతు బంధు సమితి జిల్లా డైరెక్టర్ చంద్రయ్య, సర్పంచ్ దేవన్న, నాయకులు జగదీశ్ రెడ్డి, అడెల్లు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

అగ్నిపథ్‌కు ఎంపికైన అభ్యర్థులకు సన్మానం

అభ్యర్థులను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

ఎదులాపురం, అక్టోబర్ 8 : నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా యువత కష్టపడితే విజయం సాధించవచ్చని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. అగ్నిపథ్‌లో జవాన్లుగా ఉద్యోగాలు సాధించిన కొండ్ర అనిల్, శివ శంకర్ రెడ్డి, ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికైన ఓరుగంటి పృథ్వీరాజ్‌ను ఆదివారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో స్విమ్మింగ్ కోచ్ కొమ్ము కృష్ణ, అశోక్, దాస్, దిలీప్, అఖిల్, సాయి, రాకేశ్, వినోద్, తరుణ్ పాల్గొన్నారు.

19న జంగుబాయి దేవస్థానంలో దీపారాధన

నార్నూర్, అక్టోబర్ 8 : విజయ దశమి పురస్కరించుకొని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం పరందోళి శివారులో కొలువుదీరిన ఆదివాసీల ఆర్యాధదైవమైన జంగుబాయి దేవస్థానంలో ఈ నెల 19వ తేదీన మహాపూజతో పాటు దీపారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మాన్కుపటేల్ తెలిపారు. మండలంలోని గుండాల గోండు గూడలో ఉమ్మడి జిల్లాతో పాటు మహారాష్ట్ర పరిధిలోని ఎనిమిది గోత్రాల ఆదివాసులు ఆదివారం సమావేశమయ్యారు. జంగుబాయి దేవస్థానంలో నిర్వహించే మహాపూజ, దీపారాధన గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా పండుగ సందర్భంగా పౌర్ణిమ రోజున పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఉమ్మడి జిల్లాతో పాటు మహారాష్ట్ర పరిధిలోని ఎనిమిది గోత్రాలు, నాలుగు సగల ఆదివాసులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కమిటీ గౌరవాధ్యక్షుడు మరప బాజీరావ్, అధ్యక్షుడు కొడప జాకు, ఉపాధ్యక్షుడు రాయిసిడాం జంగు, ప్రధాన కార్యదర్శి సలం శ్యాంరావ్, కార్యదర్శి జాకేరావ్, ప్రచార కార్యదర్శి హెచ్‌కే పాండురంగ్, సంయుక్త కార్యదర్శి హెచ్‌కే రామారావ్, ఆయా గ్రామాల పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

సివిల్ కానిస్టేబుల్‌కు ఎంపికైన యువతకు సన్మానం

ఉద్యోగం సాధించిన యువతను సన్మానిస్తున్న సర్పంచ్‌లు

ఇంద్రవెల్లి, అక్టోబర్ 8: సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన మండలంలోని మర్కాగూడ, కేస్లాపూర్, ముత్నూర్, దస్నాపూర్, హర్కాపూర్, డోంగర్‌గాం, ఇంద్రవెల్లి, పిప్రి, మల్లాపూర్, దేవాపూర్ గ్రామాలకు చెందిన కొడప జ్యోతి, గేడం శృతి, మడావి వరలక్ష్మి, కోటుళే పుండలిక్, డాకురే జ్ఞానేశ్వర్, కోవ వినోద్‌కుమార్, ప్రవీణ్, కిశోర్, కుడిమేత నర్సింగ్‌రావ్, కే సంగీత, దుర్వా సంజీవ్, పంద్రం లక్ష్మణ్‌ను ఆదివారం కేస్లాపూర్ నాగోబా దర్బార్‌హాల్‌లో మండల సర్పంచ్‌ల సంఘం, ఆదివాసీల ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కేస్లాపూర్ సార్‌మేడి మెస్రం వెంకట్‌రావ్‌పటేల్, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు కినక జుగాదిరావ్, సర్పంచ్‌లు కుడే కైలాస్, లక్ష్మణ్, మెస్రం నాగ్‌నాథ్, ఏర్మ జాకేశ్వర్, మడావి భీంరావ్, స్పెషల్ పోలీసులు దుర్వా రామన్న, కోడప రామారావ్, ఆదివాసీ గిరిజనులు కోట్నాక్ బారిక్‌రావ్, పెందూర్ గణేశ్, కోసే రావ్, మారుతి, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు ఇండ్ల స్థలాలకు భూమిపూజ

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 8: ఆదిలాబాద్ జర్నలిస్టులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఇండ్ల స్థలాల కల నెరవేరింది. బట్టిసావర్గాం గ్రామ పంచాయతీ పరిధిలో ఆదివారం ఎమ్మెల్యే జోగు రామన్న భూమి పూజ చేశారు. మొదటగా జర్నలిస్ట్ జేఏసీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ దేవేందర్, జేఏసీ కో కన్వీనర్ వెంకటేశ్, సభ్యులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

ఇరువురికి సన్మానం

సన్మానిస్తున్న మేరు సంఘం సభ్యులు

ఎదులాపురం, అక్టోబర్ 8 : ఉపాధ్యాయులు జడ్పీహెచ్ఎస్ రాపర్తి నరేశ్ బజార్‌హత్నూర్‌లో పీజీహెచ్ఎంగా ఉద్యోగోన్నతి పొందారు. అలాగే పొల్పెల్లి వెంకటస్వామి 24 సంవత్సరాలు ఆర్మీలో ఉద్యోగం చేసి చెన్నైలోని వెల్లింగ్టన్ నుంచి విరమణ పొందారు. ఆదివారం విఠల రుక్మిణీదేవి ఆలయంలో మేరు సంఘం ఆధ్వర్యంలో ఇరువురిని శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్నవార్ రాజు, పట్టణ అధ్యక్షుడు పోల్పెల్లి నాందేవ్ కర్నేవార్, పరమేశ్వర్, కార్యవర్గ సభ్యులు, కులస్తులు, ఆలయ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

నార్నూర్, అక్టోబర్ 8 : గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని ఖండో ఎంపీటీసీ రాథోడ్ కిరణ్ అన్నారు. గాదిగూడ మండలం ఖండో గ్రామ పంచాయతీలో ఆదివారం యువతకు స్పోర్ట్స్ కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ హెచ్‌కే చంద్రహరి, పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు అండగా ప్రభుత్వం

బోథ్, అక్టోబర్ 8 : బీఆర్ఎస్ ప్రభుత్వం ఆడబిడ్డలకు అండగా నిలుస్తున్నదని సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి అన్నారు. మండలంలోని పిప్పల్‌ధరి గ్రామంలో ఆదివారం మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, మహిళలు పాల్గొన్నారు.

డీసీసీబీ డైరెక్టర్‌కు సన్మానం

ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్

ఉట్నూర్,అక్టోబర్ 8: ఇటీవల డీసీసీబీ డైరెక్టర్‌గా ఎంపికైన పీఏసీఎస్ చైర్మన్ సామ ప్రభాకర్ రెడ్డిని ఆదివారం ఆయన కార్యాలయంలో ఉట్నూర్ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కందుకూరి రమేశ్, కోఆప్షన్ సభ్యుడు రషీద్, నాయకులు దాసండ్ల ప్రభాకర్, సీతారాం, రమేశ్, సింగారే భరత్, సోనేరావ్, బాజీరావ్, పాండురంగ్, సత్తన్న, నంద కుమార్ పాల్గొన్నారు.